సాక్షి పల్నాడు

గురువారం : 26 : జూన్ : 2025



భక్తిశ్రద్ధలతో చండీహోమం

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమావాస్య సందర్భంగా చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ఆంజనేయునికి విశేష పూజలు

మాచర్ల: గుంటూరు రోడ్డులోని సప్తగిరి కాలనీ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం విశేష పూజలు జరిగాయి.



అసంపూర్తిగా రోడ్డు పనులు

క్రోసూరు: అమరావతి – బెల్లంకొండ రోడ్డు పనుల విషయంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు. రోడ్డు మొత్తం గోతులమయంగా మారిందని వాపోతున్నారు.

న్యూస్‌రీల్

బడులను సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్



విజయపురి సౌత్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు బుధవారం మాచర్ల మండలం ఎత్తిపోతల (7 మైలు) గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇంటర్మీడియట్ వరకు బడిని అప్‌గ్రేడ్ చేయించాలని గిరిజన నాయకులు, ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, అభినందించారు. తర్వాత బ్రహ్మానందపురం తండాను సందర్శించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. విజయపురి సౌత్‌లోని పీటీజీ పాఠశాల విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఎస్టీ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ సాంబయ్య, డీటీడబ్ల్యూ జ్యోత్స్న, తహసీల్దార్ కిరణ్ కుమార్, పీటీజీ పాఠశాల ప్రిన్సిపల్ మురళీ శ్రీనివాస్, గిరిజన సలహా మండల సభ్యులు రావుల కొండలు, జెడ్పీటీసీ మల్లు స్వామి, మాజీ సర్పంచ్ కరంటోత్ పాండు నాయక్, నాగేశ్వరరావు నాయక్, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, బాలాజీ నాయక్ బామల నాయక్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ

నరసరావుపేట: జిల్లాలో పలువురు డిప్యూటీ తహసీల్దార్లు (డీటీ)లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు టి.కొండారెడ్డిని నకరికల్లుకు, అరుణదేవిని బెల్లంకొండకు, షేక్ సాల్మన్‌ను నాదెండ్లకు, ఎస్.శ్యామలతను పెదకూరపాడుకు, కె.శ్రీనివాసరావును నరసరావుపేటకు, బి.సుబ్బారావును శావల్యాపురానికికు, పి.తులసీరామ్‌ను నూజెండ్లకు, జి.వెంకటరమణను రెంటచింతలకు, పి.బ్రహ్మయ్యను దాచేపల్లికి, కె.రాజశేఖర్ నాయక్‌ను వెల్దుర్తికి, పి.వెంకటరెడ్డిని రొంపిచర్లకు, కె.బాలవెంకటేష్‌ను ముప్పాళ్లకు, ఎన్.అనూరాధను యడ్లపాడుకు, షేక్ బాషాను మాచర్లకు, ఎం.రాజాను అమరావతికి, సీహెచ్.లక్ష్మీప్రసాద్‌ను సత్తెనపల్లికి, పి.నరసయ్యను బొల్లాపల్లికి, ఐ.ఫణీంద్రను గురజాల ఆర్డీవో కార్యాలయానికి, జి.విద్యాసాగర్‌ను కారంపూడికి బదిలీ చేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



వినుకొండ: పట్టణంలోని షిరిడీ సాయిబాబా దేవస్థానంలో 34వ గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా బుధవారం భారీ గణపతి రూపం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రానైట్.. రైట్..రైట్!



దాచేపల్లిలో అధికారులు సీజ్ చేసిన గ్రానైట్ లారీలు



జీరో బిల్లుపై తరలిస్తున్న గ్రానైట్ రాయి

జీరో బిల్లులతో సరిహద్దులు దాటుతున్న సరుకు

- బాపట్ల జిల్లా మార్టూరు నుంచి చిలకలూరిపేట - నరసరావుపేట- తంగెడ మీదుగా తెలంగాణకు అక్రమ తరలింపు
- రోజుకు పదుల సంఖ్యలో తరలుతున్న లారీలు
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం
- గ్రానైట్ అక్రమ వ్యాపారంతో రూ.కోట్లు గడిస్తున్న తెలుగుదేశం నేతలు
- జీరో బిల్లులతో సరిహద్దులు దాటిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- తాజాగా 11 లారీలను పట్టుకున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు అడ్డు, అదుపులేకుండా పోతోంది. అక్రమాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా మట్టి, ఇసుక, రేషన్ బియ్యం, మద్యం, గ్రానైట్.. ఇలా చెప్పుకొంటూ పోతే బయల్పడే అవినీతి కథలు ఎన్నెన్నో.. ఇటీవల కాలంలో గ్రానైట్ అక్రమ తరలింపు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రభుత్వానికి రావలసిన రాయల్టీ చెల్లించకుండా అక్రమార్కులు అడ్డదారిలో గ్రానైట్‌ను తరలిస్తూ రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. తాజాగా బాపట్ల జిల్లా మార్టూరు నుంచి హైదరాబాద్ తరలిస్తున్న 11 గ్రానైట్ లారీలను వాణిజ్య పనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ బిల్లులను చెల్లించకుండా జీరో బిల్లుపై ఈ లారీలు తరలిస్తున్నట్లుగా అధికారులు గుర్తించి సీజ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం లోని పలువురు ప్రజాప్రతినిధులు, బడానేతలకు ఈ గ్రానైట్ వ్యవహారంలో వాటాలు ఉన్నట్లుగా చర్చ జరుగుతుంది. అధికారులకు సైతం ముడుపులు అందుతుండటంతో గ్రానైట్ హద్దులు దాటి ఇతర రాష్ట్రాలకు సైతం తరలిపోతోంది.

మా దారి అడ్డదారి

గ్రానైట్ రాయి అక్రమ తరలింపు వ్యవహారంలో అక్రమార్కులు అడ్డదారులను ఎంచుకుంటున్నారు. ఎక్కడికక్కడ తమ మనుషులతో గస్తీ నిర్వహిస్తూ తమ వ్యాపార సామ్రాజ్యాన్ని రోజురోజుకు విస్తరిస్తూ రూ.కోట్లకు పడగ లెత్తుతున్నారు. బాపట్ల జిల్లా మార్టూరులో లభించే గ్రానైట్ రాయిని అక్రమంగా లారీల ద్వారా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మార్టూరులో గ్రానైట్ రాయి లారీ లు బయలుదేరి దగ్గర నుంచి పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల, తంగెడ పరిధిలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు దాటే అంతవరకు అక్రమార్కులు అధికారుల కంట పడకుండా లారీలను సరిహద్దు దాటిస్తున్నారు. మార్టూరు నుంచి చిలకలూరిపేట, అక్కడ నుంచి నరసరావుపేట, నరసరావుపేట నుంచి పిడుగురాళ్ల మీదుగా కారంపూడి వయా గురజాల, మాచవరం, దాచేపల్లి మండలాల మీదుగా తంగెడ, పొందుగల సరిహద్దు చెక్ పోస్ట్ లను దాటిస్తున్నారు. రోజుకు 70 నుంచి 90 లారీల వరకు గ్రానైట్ రాయిని తరలిస్తున్నట్లుగా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

పదుల సంఖ్యలో పట్టివేత

తాజాగా దాచేపల్లి, పిడుగురాళ్ల, నకరికల్లు మండలాల పరిధిలో 11 గ్రానైట్ లారీలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిరోజు 70 నుంచి 90 గ్రానైట్ లారీలు హైదరాబాద్ తరలిపోతున్నట్లుగా అధికారులు గుర్తించారు. గ్రానైట్ అక్రమ రవాణా వ్యవహారం జోరందుకోవటంతో వాణిజ్య పనులు శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రానైట్ లారీలను పట్టుకునేందుకు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే 11 లారీలను పట్టుకొని అధికారులు సీజ్ చేశారు. ఏడాదిగా కూటమి ప్రభుత్వంలో అధికంగా గ్రానైట్ లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లుగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులుచెప్పుకొంటున్నారు.

నిద్రావస్థలో అధికారులు

గ్రానైట్ అక్రమ తరలింపు అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవటం తీవ్ర చర్చనీయాంశమైంది. గ్రానైట్ అక్రమ తరలింపును కట్టడి చేయాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారు. మార్టూరు నుంచి బయలుదేరుతున్న గ్రానైట్ లారీలు రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నా.. అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాపట్ల, చిలకలూరిపేట, నరసరావుపేట పరిధిలోని వాణిజ్య పనుల శాఖ, భూగర్భ గనుల శాఖ అధికారులు వీటిపై దృష్టి పెడితే ఈ అక్రమాలకు ఎప్పుడో చెక్ పడేది. అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతోపాటు అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణ వస్తుండడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మార్టూరు నుంచి వచ్చే ఈ లారీలను అక్కడి అధికారులు ఎందుకు ఆపటం లేదనే దానిపై అనుమానాలు వస్తున్నాయి. కేవలం దాచేపల్లి వద్ద మాత్రమే లారీలు పట్టుబడుతుండడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి గ్రానైట్ అక్రమ తరలింపు వ్యవహారానికి చెక్ పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఆశాభంగం

- సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- కలెక్టరేట్ ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకుల నిరసన
- డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ వేతనాలు పెరుగుతాయని, అర్హులకు పదోన్నతులు ఇస్తారని ఆశించి వీఆర్‌ఏలు భంగపడ్డారని, ఏ ఒక్క సమస్యా పరిష్కరించలేదని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీసాహెబ్ అన్నారు. రెవెన్యూ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. బందగీసాహెబ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోసం తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20వేలమంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా సుదీర్ఘ కాలం నుంచి తక్కువ వేతనంతో దిగువ స్థాయిలో పనిచేస్తూ రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. రీ సర్వే పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేయాల్సి వస్తుందని, పనిభారం పెంచి టీఏ, డీఏలు ఇవ్వకపోవడంతో ఆర్థిక సమస్యలు తోడయ్యాయన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఏకామురళి, అదే సమయానికి అక్కడకు వచ్చిన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతి పత్రం అందజేశారు. సత్తెనపల్లి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరావు, సుబ్బారావు, నరసరావుపేట డివిజన్ అధ్యక్షుడు ఆనంద్ కుమార్, సీనియర్ నాయకులు పొలేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రానైట్ వ్యాపారులకు నోటీసులు !

- అపరాధ రుసుం చెల్లించేందుకు ముందుకు రాని యజమానులు
- రంగంలోకి దిగిన తెలుగుదేశం పార్టీ నేతలు

సాక్షి టాస్క్ ఫోర్స్: వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సీజ్ చేసిన గ్రానైట్ లారీల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. జీఎస్టీ బిల్లులు చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్ రాయిని తరలిస్తున్న 11 లారీలను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకొని సీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే సంబంధిత లారీ యజమానులకు, గ్రానైట్ రాయి తరలిస్తున్న వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేసినట్లుగా తెలిసింది. ఇదిలా ఉండగా స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీలకు అతి తక్కువ అపరాధ రుసుం చెల్లించేలా తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు రంగంలో దిగినట్లుగా తెలుస్తుంది. ప్రస్తుతం ఒక్కో లారీలో రూ.3లక్షల నుంచి రూ.4 లక్షలు విలువచేసే గ్రానైట్ రాయి ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. జీఎస్టీ బిల్లులు చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ రాయికి సంబంధించి ఒక్కో లారీకి సగటున రూ.4 లక్షల నుంచి 5 లక్షల వరకు అపరాధం రుసుము విధించే అవకాశం ఉన్నట్లుగా సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. అయితే వాణిజ్య పన్నుల శాఖ అధికారులు అపరాధ రుసుం కట్టించుకునేందుకు అన్ని రకాల పత్రాల సిద్ధం చేసి ఉండగా సంబంధిత రుసుం చెల్లించేందుకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. దీంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వేచి చూసి వెను తిరిగారు.

గంజాయి హాట్‌స్పాట్‌లను తనిఖీ చేయండి

జిల్లా ఎస్పీతో కలిసి జిల్లాస్థాయి నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీలు

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లను పోలీసులు పూర్తిగా తనిఖీచేసి పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి జిల్లాస్థాయి నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ కేసులు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద గతంలో నమోదైన కేసులు, కొత్త కేసులపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల్లో ఉన్న అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. డ్రగ్ అబ్యూస్ అవగాహన, నివారణను ప్రోత్సహించేందుకు పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యాసంస్థల్లో ఈగిల్ క్లబ్‌లను ఏర్పాటుచేసి, క్లబ్ సభ్యుల వివరాలతో డేటాబేస్ నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వాకథాన్ నిర్వహణకు సూచనలు జారీ చేశారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, డీఈఓ చంద్రకళ, ఈగిల్ అధికారి, సామాజిక సంక్షేమ అధికారి శామ్యూల్ రాజీవ్, డీఆర్‌ఓ ఏకా మురళి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్పీ, మాతా జ్ఞానమ్మ డీ–అడిక్షన్ సెంటర్ (ఎన్జీఓ) ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన నేతలు మోదుగుల వేణుగోపాలరెడ్డి, డాక్టర్ పూనూరి గౌతంరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు తదితరులు

యడ్లపాడులో పట్టపగలు దారుణం

- జాతీయ రహదారి పక్కన యువకుడి మృతదేహాన్ని తగులబెట్టిన దుండగులు
- గుర్తించి మంటలు ఆర్పిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కె.నాగేశ్వర్, సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ శివరామకృష్ణ, (ఇన్‌సెట్) మృతుడి ముఖం

యడ్లపాడు: యడ్లపాడులో అత్యంత దారుణమైన, హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. నిత్యం వాహనాలతో కిటకిటలాడే జాతీయ రహదారి పక్కనే, పట్టపగలు ఓ యువకుడిని ఫ్లెక్సీలో చుట్టి నిప్పుపెట్టిన ఘటన బుధవారం కలకలం రేపింది. యడ్లపాడులోని 16వ నంబర్ జాతీయ రహదారి, సర్వీస్ మార్గం మధ్యలో ఉన్న మురుగు కాల్వలో గుర్తుతెలియని దుండగులు ఓ యువకుడి మృతదేహాన్ని ఫ్లెక్సీలో చుట్టి పడేసి నిప్పంటించారు. సరిగ్గా ఉదయం 8:30 గంటల సమయంలో హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఆ వైపుగా వెళ్తుండగా, కాల్వ లోంచి మంటలు ఎగసిపడటం చూసి అనుమానంతో దగ్గరకు వెళ్లారు. మంటల్లో మనిషి శరీరం కాలిపోతుండటం చూసి షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, తమ కారులోని వాటర్ క్యాన్‌తో మంటలను ఆర్పేశారు. కానీ, అప్పటికే దుండగుల దారుణానికి ఆ యువకుడి ముఖం తప్ప దేహం అంతా పూర్తిగా కాలి బూడిదైపోయింది.

■ సమాచారం అందిన వెంటనే నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వర్, చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. అనంతరం, మృతదేహాన్ని ఫోరెన్సిక్, పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్థానికంగా కలకలం

పట్టపగలు, అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి దారుణం జరగడం నియోజకవర్గంలో కలకలం రేపింది. ఈ ఘటన స్థానికులతో పాటు పోలీసులను కూడా దిగ్భ్రాంతికి గురిచేసింది. అసలు ఈ యువకుడు ఎవరు? ఎక్కడివాడు? దుండగులు అతడిని ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు? హత్యకు గల కారణాలు ఏంటి? ఇది ముమ్మాటికీ హత్యే అయితే, ఎక్కడ చేసి ఇక్కడకు తెచ్చారు? పట్టపగలే నిప్పంటించేంత తెగించి ఎందుకు ఈ దారుణానికి ఒడిగట్టారు? వంటి అనేక ప్రశ్నలు ప్రస్తుతం పోలీసులకు సవాలుగా మారాయి. మృతుడి ఆచూకీ కోసం సంఘటన స్థలం వద్ద తీసిన చిత్రాలను అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించినట్లు సమాచారం. నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వర్ పర్యవేక్షణలో పోలీసులు పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

వైఎస్సార్ సీపీ నాయకులపై కేసు

నరసరావుపేట రూరల్: తమ విధులకు ఆటంకం కలిగించారంటూ రూరల్ సీఐ పి.రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై బుధవారం కేసు నమోదయింది. ఈనెల 23వ తేదీన నిర్వహించిన యువత పోరు కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌కు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు కందుల శ్రీకాంత్, గౌతమ్‌రెడ్డితో పాటు మరికొంతమందిని అనుమతి లేని కారణంగా జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట అడ్డుకోవడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా విధులు నిర్వహిస్తున్న తనతో పాటు తమ సిబ్బందిపై వైఎస్సార్ సీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో సీఐ పి.రామకృష్ణ పేర్కొన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే విధంగా చర్యలు చేపట్టిన వారిపై చట్టప్రకారంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌలురైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు

పంట సాగుదారుల చట్టంపై కరపత్రాలు ఆవిష్కరించిన డీఆర్‌ఓ, జిల్లా వ్యవసాయాధికారి



నరసరావుపేట: ప్రతి కౌలురైతుకు పంటసాగుదారు కార్డులు జారీచేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలనే లక్ష్యంతో ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతుసేవా కేంద్రాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి పేర్కొన్నారు. బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో పంట సాగుదారుల చట్టంపై రూపొందించిన కరపత్రాలను కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ, వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళిలు ఆవిష్కరించారు. డీఆర్‌ఓ మురళి మాట్లాడుతూ ప్రతి కౌలురైతు ఈ సదస్సులో పాల్గొని గుర్తింపు కార్డులు తీసుకొని ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను పొందాలని కోరారు. పంటసాగుదారు కార్డు దారులందరికీ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో క్రాప్‌లోన్లు మంజూరు చేయించడం, సాగుదారులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.

రైతు ఆత్మహత్యల్లో మూడొంతులు కౌలు రైతులే..

డీఏఓ ఐ.మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల పైగా కౌలు రైతులు ఉన్నారనీ రాధాకృష్ణన్ రిపోర్టు ఆధారంగా తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యల్లో మూడొంతులు కౌలు రైతులే ఉన్నారన్నారు. వీఆర్వో గుర్తించిన గుర్తింపు కార్డు ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి కౌలురైతులు రుణాలు పొందవచ్చన్నారు. డీబీఆర్‌సీ జిల్లా కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఏరియా కో–ఆర్డినేటర్స్ తోకల సాంబయ్య, గడ్డిపర్తి కోటిరత్నం పాల్గొన్నారు.

మిర్చి రైతులను గాలికొదిలిన చంద్రబాబు



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ కుమార్

పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం చేసేది గోరంత చెప్పేది కొండంత అనే చందగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం మిర్చి రైతుల సమస్యలపై అశ్రద్ధ వహిస్తుందన్నారు. మిర్చి సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా సుమారు రూ.25,000 పలికిన మిర్చి ధర కూటమి ప్రభుత్వంలో రూ.6వేలకు పడిపోయిందన్నారు. ఫిబ్రవరిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డు పర్యటనతో బెంబేలెత్తిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు కనీస మద్దతు ధర రూ.11,700 ఉండబోతుందంటూ ఆర్భాటపు ప్రకటన చేశారన్నారు. అంతేకాకుండా అప్పటికే తక్కువ ధరకు అమ్మిన రైతులకు మిగిలా డబ్బుని తిరిగి చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, అందుకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని కూడా చెప్పారన్నారు. అయితే ఇప్పటివరకు మిర్చి రైతులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా కూటమి ప్రభుత్వం దగా చేసిందన్నారు. ఆ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో మిర్చి రైతులు ప్రస్తుతం మిర్చి వేసేందుకు భయపడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ఈ నెల 20 తేదీలోపు అమలు చేస్తామని ప్రకటించారని, ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని అశోక్‌కుమార్ ప్రశ్నించారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాట

కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల నిరసన




డీఆర్వో ఖాజావలికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘం నాయకులు

లక్ష్మీపురం: ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం వీఆర్‌ఏలు నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వో ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన పేరుతో హామీలు అమలు చేశామంటూ పెద్దఎత్తున సభలు నిర్వహిస్తూ ఉత్సవాలు చేసుకుంటోందని విమర్శించారు. వాటిలో వీఆర్‌ఏలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదని తెలిపారు. మంత్రి నారా లోకేష్ నాడు నిర్వహించిన యువగళం, పాదయాత్రలో అధికారంలోకి వస్తే తమ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సహాయకులతో సమావేశం జరిపి, సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇది నేటికీ అమలు కాలేదని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వీఆర్‌ఏలకు పే స్కేలు వేతనాలు ఇస్తోందని, ఇక్కడ ప్రభుత్వాలు ఆదిశగా ఎందుకు ఆలోచించట్లేదని ఆయన ప్రశ్నించారు. వీఆర్‌ఏలకు గతంలో డీఏను వేతనంతో కలిపి ఇచ్చే వాళ్లని, ప్రస్తుతం విడిగా ఇవ్వడంతో పెరుగుదల లేదని పేర్కొన్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుంచి వేతనాలు పెంపు లేని కారణంగా వీఆర్‌ఏలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీఆర్‌ఏలుగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వారు ఉంటున్నారని, వారి సమస్యల ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి పోరాటం చేస్తామని లక్ష్మణరావు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు బొక్క సాంబశివరావు, షేక్ కరీమున్నిసా, షేక్ ఆదం షఫీ, ఎస్. రామారావు, హనుమంతరావు, ప్రతాప్, పాండు, రాజేష్, రవి, వెంకయ్య పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయస్థాయిలో ప్రథమం

స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన సత్తెనపల్లి క్రీడాకారుడు



జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారుడు శరత్

సత్తెనపల్లి: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లా యువకుడు ప్రతిభ చాటాడు. కర్ణాటక రాష్ట్రంలోని దేవనగిరిలో ఈ నెల 22 నుంచి 30 వరకు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ సీనియర్ మెన్, జూనియర్, సబ్ జూనియర్, ఉమెన్ పోటీలు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టులో పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు ఎస్.శరత్ బంగారు, రజత పతకాలతో ఓవరాల్‌గా జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి పల్నాడు జిల్లా ప్రతిష్టను ఇనుమడింప చేశాడు. జాతీయ స్థాయి స్క్వాట్‌లో శరత్ 303 కేజీలు ఎత్తి సరికొత్త జాతీయ స్థాయి రికార్డు సృష్టించి, బంగారు పతకం సాధించాడు. డెడ్ లిఫ్ట్‌లో రజతం, 74 కిలోల విభాగంలో మొత్తం 723 కిలోలు ఎత్తి కాంస్య పతకం సాధించాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారుడు ఎస్.శరత్‌ను బుధవారం పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య తదితరులు అభినందించారు.

జిల్లాలో 25 మండలాల్లో వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో 25 మండలాల్లో వర్షం పడినట్లు జిల్లా వాతావరణ అధికారులు బుధవారం తెలియచేశారు. జిల్లా వ్యాప్తంగా 128.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందన్నారు. మాచర్ల 3.2మి.మీ, దుర్గి 2.0, రెంటచింతల 12.4, గురజాల 11.0, దాచేపల్లి 6.0, కారంపూడి 4.2, పిడుగురాళ్ల 5.8, మాచవరం 5.8, బెల్లంకొండ 9.8, అచ్చంపేట 9.4, క్రోసూరు 10.2, అమరావతి 7.4, పెదకూరపాడు 6.0, సత్తెనపల్లి 67.6, రాజుపాలెం 8.8, నకరికల్లు 1.2, బొల్లాపల్లి 1.4, యడ్లపాడు 1.6మి.మీటర్ల వర్షం కురిసింది.